సాక్షి విశాఖపట్నం

గురువారం । 9 । జనవరి । 2025


ప్రధాని పర్యటన నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని నిరసన తెలుపుతున్న వామపక్ష కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. కిందపడేసి తొక్కేశారు. లాక్కెళ్లి జీపుల్లో పడేశారు. అనంతరం స్టేషన్‌కు తరలించారు.

స్వ భజన.. పర భజన పరస్పర భజన

ప్రధాని మోదీ సభలో ఆద్యంతం ఇదే తంతు


ప్రధాని మోదీకి గవర్నర్ నజీర్ స్వాగతం

- స్టీల్‌ప్లాంట్‌పై భరోసా దక్కలేదు.. మెట్రో ఊసెత్తలేదు..
- భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ ప్రస్తావన లేదు
- చంద్రబాబు, పవన్ నోట వినిపించని 'ఉక్కు' మాట
- నిరసన తెలిపిన వారిని అరెస్టులు చేయించిన ప్రభుత్వం


పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం చప్పట్లు కొడుతున్న ప్రధాని మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాఖ సిటీ : ప్రధానమంత్రి మోదీ సభతో కూటమి ప్రభుత్వ బండారం బట్టబయలైంది. స్టీల్‌ప్లాంట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు ఉన్న చిత్తశుద్ధేమిటో తేటతెల్లమైంది. గంటన్నర పాటు సాగిన ప్రసంగాల్లో ఎవరి నోటా స్టీల్‌ప్లాంట్ మాట రాలేదు. ఉక్కు పరిశ్రమ పరిరక్షణపై భరోసా రాలేదు. మెట్రో రైలు ప్రాజెక్టు ఊసెత్తలేదు. భోగాపురం విమానాశ్రయానికి కనెక్టివిటీ ప్రస్తావన లేదు. సభలో ఆద్యంతం పర భజన, స్వభజన, పరస్పర భజనే వినిపించింది. కేవలం ప్రధానిని పొగడ్తలతో ముంచెత్తడానికే కూటమి ప్రభుత్వం బహిరంగ సభ ఏర్పాటు చేసిందన్న భావన ప్రతీ ఒక్కరిలోను కలిగింది.

మిట్టల్ స్టీలే ముద్దా..?

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై నోరెత్తని చంద్రబాబు మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌పై మాత్రం తెగ ప్రేమను కురిపిస్తున్నారు. మిట్టల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను ఎలా తొలగించాలన్న అంశంపై ప్రధాని మోదీతో మాట్లాడానని చంద్రబాబు సభలోనే చెప్పడం విశేషం. ఈ ప్లాంట్‌కు ప్రత్యేకంగా పైప్‌లైన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఒక ప్రైవేటు స్టీల్‌ప్లాంట్ కోసం అంతలా తాపత్రయపడుతున్న చంద్రబాబు, పవన్‌లు విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కనీసం నోరెత్తకపోవడం అందరినీ విస్మయానికి గురిచేసింది. దేశంలో ఇతర ప్రాజెక్టులు, అంశాలను ప్రస్తావిస్తూ మోదీపై పొగడ్తల వర్షం కురిపించిన ఇరువురూ.. విశాఖకు సంబంధించి ఒక అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకువెళ్లకపోవడం గమనార్హం.

'ఉక్కు' నిరసనలు.. అరెస్టులు

స్టీల్‌ప్లాంట్ భవితవ్యంపై భరోసా ఇవ్వాలని వామపక్ష పార్టీలు, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు పట్టుబట్టారు. విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధానితో దీనిపై ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. దీంతో కూటమి ప్రభుత్వం వీరిలో చాలా మందిని గృహ నిర్బంధం చేసింది. ఉక్కుపై లేచిన నోర్లను మూయించే ప్రయత్నం చేసింది. అయినప్పటికీ కొంత మంది మద్దిలపాలెం, ఇతర ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో వారిని అరెస్టులు చేయించింది.

'ఉక్కు'పై నోరుమెదపని సీఎం, డీసీఎం

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగ, కార్మిక సంఘాలు 1,427 రోజులుగా నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నాయి. ప్రధాన మంత్రి విశాఖ పర్యటన సందర్భంలో అయినా ఉక్కు పరిశ్రమ పరిరక్షణపై భరోసా వస్తుందని అందరూ భావించారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనంపై ప్రధానితో ఒక ప్రకటన చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. గత మూడు రోజులుగా బైక్ ర్యాలీలు, ఆందోళనలు చేపట్టారు. పీఎం సభలో స్టీల్‌ప్లాంట్‌పై ఒక భరోసా వస్తుందని ఆశపడ్డారు. కానీ ఇవేవీ చంద్రబాబు, పవన్‌లకు వినిపించలేదు. బహిరంగ సభలో ఇద్దరి నోటా స్టీల్‌ప్లాంట్ మాట వినిపించలేదు. ఉక్కు పరిశ్రమపై భరోసా ఇవ్వాలని కనీసం అడిగే ధైర్యం కూడా చేయలేదు.



విశాఖ అభివృద్ధి ప్రస్తావన లేదు

ప్రధాని మోదీ సభలో విశాఖ అభివృద్ధి ప్రస్తావన లేకుండా పోయింది. ప్రధానంగా మెట్రో రైలు ప్రాజెక్టుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డీపీఆర్‌ను సైతం సిద్ధం చేసింది. దీనికి నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరింది. తాజాగా ప్రధాని మోదీ విశాఖ వచ్చిన సందర్భంలో మెట్రో ప్రాజెక్టుపై ప్రకటన వచ్చే అవకాశం ఉందని అందరూ భావించారు. కానీ చంద్రబాబు గానీ, పవన్ కల్యాణ్ గానీ మెట్రో రైలు ప్రాజెక్టును కూడా ప్రస్తావించలేదు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన జరిగి నిర్మాణంలో ఉన్న భోగాపురం విమానాశ్రయ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విశాఖ నుంచి ఈ ఎయిర్‌పోర్టుకు వేగవంతంగా చేరుకునేందుకు వీలుగా కనెక్టివిటీ రహదారుల అభివద్ధికి గత ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. దానిపై కూడా చంద్రబాబు నోరెత్తలేదు. విశాఖకు సంబంధించి ఒక ప్రాజెక్టు ప్రస్తావన లేకుండానే సభను ముగించారు.

నగర ప్రథమ పౌరురాలికి అవమానం

నగర ప్రథమ పౌరురాలు మేయర్ హరి వెంకట కుమారికి ఘోర అవమానం జరిగింది. ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు కనీసం కూటమి ప్రభుత్వం ఆహ్వానించలేదు. వాస్తవానికి ప్రముఖులు ఎవరు వచ్చినా ప్రథమ పౌరురాలిగా రాజకీయాలు, పార్టీలకు సంబంధం లేకుండా గౌరవించాలి. ఇందుకు భిన్నంగా ప్రధాని నగరానికి వచ్చినప్పటికీ అధికారులు కనీస సమాచారం కానీ ఆహ్వానం కానీ ఇవ్వకపోవడం గమనార్హం. అయితే చివరికి వీడ్కోలు పలికే సమయానికి మాత్రం రావాలంటూ కబురు పంపినట్లు తెలుస్తోంది. బీసీ మహిళ పట్ల కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరు విమర్శల పాలవుతోంది.

ముగిసిన ప్రధాని పర్యటన

- సాయంత్రం 4.30కు రోడ్ షో
- ఓపెన్ టాప్ జీప్‌లో ప్రజలకు అభివాదం చేసిన ప్రధాని మోదీ
- పూలతో స్వాగతం పలికిన ప్రజలు
- బహిరంగ సభలో పలు ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన


రోడ్డు షోలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాఖ సిటీ : ప్రధాని మోదీ విశాఖ పర్యటన విజయ**వంతంగా ముగిసింది. భారీ** భద్రతా ఏర్పాట్ల మధ్య **రోడ్ షో, బహిరంగ సభ** ప్రశాంతంగా సాగింది. **ప్రధాని బుధవారం సాయం**త్రం 4.15కు ఇండియన్ **ఎయిర్‌ఫోర్స్ విమానంలో** విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు **చేరుకున్నారు. అక్కడ గవర్న**ర్ అబ్దుల్ నజీర్, ముఖ్య**మంత్రి చంద్రబాబు, డిప్యూ**టీ సీఎం పవన్ కల్యాణ్‌లు **ప్రధానికి స్వాగతం పలికా**రు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సిరిపురం ప్రాంతంలోని వెంకటాద్రి వంటిల్లు ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఓపెన్ టాప్ జీప్ ఎక్కారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న జనాలకు అభివాదాలు చేస్తూ ముందుకు సాగారు. ప్రజలు కూడా పూలతో మోదీకి స్వాగతం పలికారు. సాయంత్రం 5.30కు ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

జీప్‌లో లోకేష్‌కు దక్కని చోటు

ప్రధాని సభ సందర్భంగా నగరమంతా హోర్డింగ్‌లు, కటౌట్లు వెలిశాయి. అన్నింటిలోను మోదీ, చంద్రబాబు, పవన్, లోకేష్ ఫొటోలే దర్శనమిచ్చాయి. బీజేపీ వారి ఫొటోలు ఎక్కడా కనిపించలేదు. దీంతో మోదీ రోడ్ షోలో కూడా లోకేష్ ఉంటారని అందరూ భావించారు. అయితే అనూహ్యంగా ఓపెన్ టాప్ జీప్‌లో లోకేష్‌కు చోట దక్కలేదు. ప్రధాని మోదీ రోడ్‌షో జీప్‌లో చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరీలు మాత్రమే ఉన్నారు.

చంద్రబాబు స్పీచ్ మధ్యలోనే జనాలు జంప్

బహిరంగ సభ సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమైంది. అనకాపల్లి ఎంపీ సి.ఎం .రమేష్, మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు కేవలం 5 నుంచి 10 నిమిషాలు మాత్రమే ప్రసంగించారు. అనంతరం మైక్ అందుకున్న చంద్రబాబు మాత్రం అరగంటకు పైగా మాట్లాడారు. దీంతో ఆయన స్పీచ్ మధ్యలోనే జనాలు వెళ్లిపోవడం ప్రారంభించారు. దీంతో అరగంట తరువాత స్పీచ్‌ను వేగంగా పూర్తి చేశారు. అనంతరం ప్రధాని మోదీ ప్రజలను ఉద్దేశించి 20 నిమిషాలు ప్రసంగించారు. ఈ సందర్భంగా రూ.2 లక్షల విలువైన పలు ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. సభ అనంతరం ప్రధాని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానంలో భువనేశ్వర్‌కు పయనమయ్యారు.

30 వేల మంది రాక


ప్రధాని సభకు భారీగా జనాలను తరలించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సభా ప్రాంగణంలో మూడు టెంట్లు ఏర్పాటు చేసి ఒక్కో దానిలో 7 వేల సీట్లను ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర నుంచి బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల్లో జనాలను తరలించారు. రోడ్ షో, బహిరంగ సభకు లక్ష నుంచి రెండు లక్షల మంది జనాలు వచ్చినట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించినా.. వాస్తవ సీటింగ్ సామర్థ్యం ప్రకారం 30 వేల మంది మాత్రమే సభకు హాజరైనట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి.

భారీ భద్రతా ఏర్పాట్లు

ప్రధాని సభకు పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 5 వేల మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు కల్పించారు. ఒకవైపు వీఐపీలకు భద్రతా చర్యలు చేపడుతూనే.. మరోవైపు ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేశారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే బస్సులు, ప్రైవేటు వాహనాలను నిలిపేందుకు ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యాలు కల్పించారు. దీంతో ప్రశాంతంగా ప్రధాని సభ ముగిసింది.

కూటమి షోలో అష్టకష్టాలు

- మోదీ సభకు రావాలంటూ డ్వాక్రా మహిళలపై తీవ్ర ఒత్తిడి
- శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం నుంచి కూడా జనాల తరలింపు
- మధ్యాహ్నం పాచిపోయిన పులిహోర
- 2,280 ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులతో పాటు స్కూల్ బస్సుల సేకరణ
- దీంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించిన యాజమాన్యాలు
- ఆర్టీసీ బస్సులు లేక కాంప్లెక్సు, బస్టాండ్‌లో ప్రయాణికుల పాట్లు
- చివరకు ఆర్టీసీ పార్సిల్ సర్వీస్ బస్సుల్లోనూ ప్రజల తరలింపు


మద్దిలపాలెం జాతీయ రహదారి వద్ద స్తంభించిన ట్రాఫిక్

ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

ఆర్టీసీ, ప్రైవేటు బస్సులతో పాటు ఆటో సర్వీసులు కూడా జనసమీకరణ కోసం సేకరించడంతో నగరంలో రవాణా సేవలు లేకుండా పోయాయి. దీంతో ఉద్యోగాలు, పనుల కోసం వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అంతర జిల్లాల సర్వీసులు లేకపోవడంతో గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూపులు చూశారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు నగరంలో ప్రతి బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా కనిపించాయి. కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రధాని సభను విజయవంతం చేయడంపైనే దృష్టి పెట్టి ప్రజలకు ప్రత్యామ్నాయాలను కల్పించకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.


ఎండలో రోడ్డుపై కూర్చున్న మహిళలు

విశాఖ సిటీ : ఆఫీస్‌లకు వెళ్లడానికి బస్సు లేదు. ఊరెళ్లాలంటే మూడు, నాలుగు గంటలైనా బస్సు రాలేదు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లడానికి ఆటో కనిపించలేదు. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, ఆటోలు, టాటా మ్యాజిక్‌లు.. ఇలా అన్నింటినీ కూటమి నేతలు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభకు జనాన్ని తరలించేందుకు వినియోగించారు. సాధారణ ప్రజల రవాణా సౌకర్యాలపై కనీసం దృష్టి పెట్టలేదు. వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. కూటమి షోను విజయవంతం చేయడమే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయాలతో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. ఉద్యోగాలకు, పనులకు వెళ్లడానికి బస్సులు గానీ, ఆటోలు గాని లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఒక బహిరంగ సభ పేరుతో సాధారణ ప్రజలను, విద్యార్థులను, ప్రయాణికులను అవస్థలకు గురి చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

పాఠశాలల బస్సులు స్వాధీనం

ప్రధాని సభ పేరుతో కూటమి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించింది. బస్సులు, ఆటోలనే కాకుండా స్కూల్, కాలేజీ బస్సులను కూడా విడిచిపెట్టలేదు. వాటిని కూడా బలవంతంగా స్వాధీనం చేసుకుంది. దీంతో విద్యార్థులు పాఠశాలలు, కాలేజీలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా స్కూల్, కాలేజీ యాజమాన్యాలు సెలవులు ప్రకటించాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం తమ బల ప్రదర్శన కోసం విద్యార్థుల భవితవ్యాన్ని సైతం పట్టించుకోకపోవడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

భారీగా వాహనాల సేకరణ

ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో బుధవారం ప్రధాని మోదీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.2 లక్షల కోట్లు విలువైన పలు ప్రాజెక్టులకు పీఎం చేతుల మీదుగా వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డింది. ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో జన సమీకరణ చేపట్టింది. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులను తమ ఆధీనంలోకి తీసుకుంది. అన్ని ప్రాంతాల నుంచి 2,280 బస్సులను జనాల తరలింపునకు మళ్లించింది. చివరకు ఆర్టీసీ పార్సిల్ సర్వీస్ బస్సులను కూడా విడిచిపెట్టలేదు. అలాగే 2,280 ఆటోలు, 382 మినీ బస్సులు, 150 టాటా మ్యాజిక్‌లలో జనసమీకరణ చేపట్టింది. దీంతో అంతర జిల్లాల సర్వీసులు పూర్తిగా తగ్గిపోయాయి. విశాఖలో ఆర్టీసీ సేవలు 80 శాతం మేర నిలిచిపోయాయి.

జనాలకు పాచిపోయిన పులిహోర

ప్రధాని సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేపట్టారు. ఈ సభకు రావాలని డ్వాక్రా గ్రూపు మహిళలపై ఒత్తిడి తీసుకువచ్చారు. లేనిపక్షంలో సంఘాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో సభకు వచ్చే వారికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ముట్టజెప్పారు. కొన్ని చోట్ల మాత్రం రూ.500, రూ.300 మాత్రమే ఇచ్చారు. మధ్యలో ఉన్న వారు కొంత నొక్కేస్తున్నారని జనాలు మండిపడ్డారు. ఇదిలా ఉంటే.. సాయంత్రం 5.30 గంటలకు ప్రధాని సభ ఉండగా.. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచి ఉదయమే బస్సుల్లో జనాలను తరలించారు. వీరికి మధ్యాహ్నం భోజనం కింద పాచిపోయిన పులిహోర బాక్సులు అందజేశారు. వాటిని తెరిచి వెంటనే దుర్వాసన రావడంతో అందరూ విసిరికొట్టారు. దీంతో చాలా మంది ఆకలితోనే ఉన్నారు. కొంత మంది మాత్రం సభ వరకు ఉండకుండా మధ్యలోనే వెళ్లిపోయారు.

స్టీల్‌ప్లాంట్‌కి ద్రోహం.. మిట్టల్‌కి దాసోహం

పోరాట కమిటీ నాయకుల ఆగ్రహం



స్టీల్‌ప్లాంట్ ముఖచిత్రం

ఉక్కునగరం: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ మొదటిసారి విశాఖ వస్తున్నాడు.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడానికి 1,427 రోజులుగా నిరాహార దీక్షలు చూసి కరిగి ఉంటాడు.. తమకు ఉపశమనం కలిగిస్తాడని ఆశగా ఎదురు చూసిన స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నిరాశ ఎదురైంది. ప్రధాని స్టీల్‌ప్లాంట్ ప్రస్తావన తీసుకురాకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసింది. ఎన్నికల ముందు ఊదర కొట్టాం.. గెలిచిన తర్వాత మొదటిసారి విశాఖ ప్రధాని వచ్చాడు.. అతనికి విశాఖ స్టీల్ ప్లాంట్ అంశాన్ని చెప్పి ప్రైవేటీకరణ ఆపండి.. సెయిల్‌లో విలీనం చేయండి.. అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు చెబుతారని ఎదురు చూసిన ఉక్కు వర్గాలను వారి తీరు నివ్వెరపోయేలా చేసింది. విశాఖ స్టీల్ ప్లాంట్ అంశాన్ని ప్రస్తావించకపోగా మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం పైపు లైన్ కావాలంటూ చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగం స్టీల్‌ప్లాంట్ కార్మికులకు పుండు మీద కారం చల్లినట్టు అయింది.

మళ్లీ మోసం చేశారు



స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ అంశం ప్రధాని మోదీ ప్రకటించలేదు.. ఈ విషయం ప్రధానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు చెప్పకపోవడం దుర్మార్గం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టీల్‌ప్లాంట్‌కు చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ మరింత పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తాం.

– డి.ఆదినారాయణ, ఉక్కు పోరాట కమిటీ చైర్మన్, స్టీల్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

విశాఖ ఆర్థిక రాజధాని ఎలా...



స్టీల్‌ప్లాంట్ లేకుండా విశాఖను ఆర్థిక రాజధాని చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదం. మూడేళ్లుగా ప్లాంట్ కోసం ఉద్యమం చేస్తున్నాం.4 నెలలుగా ఉద్యోగులకు జీతాలు లేవు. వీటన్నింటిని పట్టించుకోకుండా 2 లక్షల కోట్ల పెట్టుబడి వస్తాయని చెబుతున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ దుర్మార్గాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తాం.

-జె.అయోధ్యరామ్, ఉక్కు పోరాట కమిటీ కో–కన్వీనర్

స్టీల్‌ప్లాంట్‌ను ప్రస్తావించకపోవడం అన్యాయం



బహిరంగ సభలో ప్రధాని విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి కనీస ప్రస్తావన తేకపోవడం అన్యాయం. రాష్ట్రంలోని అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్‌ప్లాంట్‌ను కాదని ప్రైవేటు వ్యక్తులకు చెందిన మిట్టల్ స్టీల్‌ప్లాంట్ అంశాన్ని ప్రస్తావించడం దుర్మార్గం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడం ఇదేనా.

– మంత్రి రాజశేఖర్, పోరాట కమిటీ చైర్మన్, స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి

చంద్రబాబు, పవన్ మోసం చేశారు..



నాడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రధాని పాల్గొన్న బహిరంగ సభలో ప్రజల ముందు స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలని కోరారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ప్రధాని వద్ద స్టీల్‌ప్లాంట్ అంశాన్ని ప్రస్తావించకుండా ప్రజలను మోసం చేశారు. వారిని ప్రజలు క్షమించరు.

– డి.వి.రమణారెడ్డి, ఉక్కు పోరాట కమిటీ సభ్యుడు, స్టీల్ వైఎస్సార్‌టీయూసీ కార్యదర్శి

మోదీ సభకు నిరసన సెగ

- మద్దిలపాలెం జంక్షన్‌లో హోరెత్తిన ఆగ్రహ జ్వాలలు
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణ ప్రకటన చేయాలని నినాదాలు
- సీపీఎం, సీపీఐ కార్యకర్తల అరెస్ట్
- అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరు
- సీపీఎం, సీపీఐ, ఏపీఎఫ్‌టీయూల ఖండన



ఏఐటీయూసీ నేతను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు



సీపీఐ నేతలను అడ్డుకుంటున్న పోలీసులు



ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సీపీఎం నాయకులు

విశాఖ విద్య/మద్దిలపాలెం/ఆరిలోవ: మద్దిలపాలెం జంక్షన్.. బుధవారం నిరసన జ్వాలలతో హోరెత్తింది. ప్రధాని మోదీ విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, కాంగ్రెస్, ఎస్ఎఫ్ఐ వేర్వేరుగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణపై స్పష్టమైన ప్రకటన చేయాలని వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, ఎస్ఎఫ్ఐ నినదించగా, ఆంధ్రాకు అన్యాయం చేసిన మోదీ గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ నల్ల జెండాలు, ఫ్లెక్సీలతో ఆందోళన చేశాయి. మంగళవారం రాత్రి నుంచి విశాఖ, అనకాపల్లి జిల్లాల వ్యాప్తంగా సీపీఎం, సీపీఐ నాయకులను పోలీసులు గృహ నిర్బంధాలు చేశారు. మోదీ సభ నేపథ్యంలో ముందస్తు అరెస్టులు చేసినా.. పక్కా వ్యూహంతో ఆందోళనకారులు మద్దిలపాలెం జంక్షన్‌కు తరలివచ్చి తమ నిరసన గళాన్ని వినిపించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేసుకుంటూ సభా ప్రాంగణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో.. పోలీసులు వారిని నిలువరించారు. తీవ్ర పెనుగలాట జరగడంతో పలువురు ఆందోళనకారులు కిందపడిపోయారు. అయినప్పటికీ పోలీసులు వారిని లాక్కెళ్లి వాహనాల్లోకి ఎక్కించారు. ఎంవీపీ, ఆరిలోవ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

ఉత్తరాంధ్రకు ఏం చేశారని రోడ్‌షో?

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, సీఐటీయూ, ఇతర కార్మిక సంఘాలు నిరసనలు చేపట్టాయి. మద్దిలపాలెం జంక్షన్‌లో నిరసనలకు సిద్ధమవుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి, ఎంవీపీపోలీస్ స్టేషన్ తరలించారు. అలాగే ఎంఎంటీసీ కాలనీలో ఉన్న సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పడాల గోవింద, ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అడ్డూరి శంకర్‌రావును ముందస్తుగా అరెస్టు చేసి ఎంవీపీ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పడాల రమణ మాట్లాడుతూ మోదీ ఉత్తరాంధ్రకు ఏం అభివృద్ధి చేశారని రోడ్ షో, బహిరంగ సభలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. లక్షలాది మందికి ఉపాధి కలిస్తూ.. కేంద్ర ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కావాలనే కుట్రలు చేసి.. ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారన్నారు. 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజుతో పాటు సీపీఎం నాయకులు ఆర్.కె.ఎస్.వి. కుమార్, బి.జగన్, బొట్టా ఈశ్వరమ్మ, పి.మణి, వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు, డి.అప్పలరాజు, సీపీఐ నాయకులు ఎ.విమల, కె.సత్యనారాయణ, రెహ్మాన్, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, పి.మన్మథరావు, పి.గోవింద్, ఏపీఎఫ్‌టీయూ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే కార్మిక సంఘాల నాయకులు కె.ఈశ్వరరావు కె.శివ, పిల్లా రమణ. సిహెచ్ సూరిబాబు, కొండబాబు, ఎం. శివలను అరెస్ట్ చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యు డు వి.కృష్ణారావు, సభ్యులు సుబ్బారావు, పైడిరాజు, నాయుడు, కుమార్ తదితర 13 మందిని హనుమంతవాక వద్ద గల ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎంవీపీకాలనీ స్టేషన్‌కు 70 మందిని తరలించారు.

మోదీ గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ నిరసన

ఆంధ్రాకు అన్యాయం చేశారని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కాంగ్రెస్ తూర్పు ఇన్‌చార్జి ప్రియాంక దండి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఏయూ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేశారు. నల్ల జెండాలు, ప్లకార్డులతో మోదీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. జాతీయ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి మమతా నాగిరెడ్డి, మహిళా ప్రతినిధి కాండవ గాయత్రి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు, రాష్ట్ర కార్యదర్శి పినమాల శివ కుమార్, విశాఖ అధ్యక్షుడు అల్లిపిల్లి సతీష్ కుమార్, డాక్టర్ పూడి కిరణ్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, ఎంవీపీ స్టేషన్‌కు తరలించారు.



కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

విశాఖకు మరోసారి మోదీ మొండి చెయ్యి


- మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను బలిస్తారా?
- సీపీఎం విశాఖ జిల్లా కమిటీ

సీతమ్మధార/మద్దిలపాలెం: విశాఖ సాక్షిగా మోదీ మరోసారి ద్రోహం చేశారని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణ, సొంత ముడి ఇనుప ఖనిజ గనుల కేటాయింపు, క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ కింద రూ.18 వేల కోట్లపై ప్రధాని ప్రకటన చేయకపోవడం బాధాకరమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.గంగారావు, జిల్లా కార్యదర్శులు ఎం. పైడిరాజు, ఎం.జగ్గునాయుడు ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. విశాఖకు, ఉత్తరాంధ్రకు లబ్ధి చేకూర్చే ఏ ప్రకటనా చేయకపోవడం మరోసారి ద్రోహం చేయడమేనన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కనీసం విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌కి అవసరమైన ముడి ఇనుప ఖనిజం సరఫరా, ఇతర అనుమతుల గురించి సాగిల పడి మాట్లాడటం విశాఖ స్టీల్ ప్లాంట్‌కి ద్రోహం చేయడమేనని అన్నారు. కేంద్ర బీజేపీ, రాష్ట్ర టీడీపీ, జనసేన కూటమి కలిసి మిట్టల్ ప్లాంట్ కోసం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను బలిచ్చేలా కుట్ర పన్నినట్టు బుధవారం మోదీ బహిరంగ సభతో తేలిపోయిందన్నారు. దీనికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.


రేపు కంచరపాలెం పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10న కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ అధికారి టి.చాముండేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న జాబ్ మేళాలో డబ్ల్యూఎన్ఎస్, సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఆదిత్య బిర్లా పాంటలూన్స్ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ పూర్తిచేసిన, ఫెయిలైన యువతీయువకులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 9490632318 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యం వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్, ఆధార్ అనుసంధానమైన మొబైల్ నెంబర్‌తో హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

కఠిన నిబంధనలతో మహిళల ఇక్కట్లు



ఏయూ గేటు వద్ద మహిళను అనుమతించని పోలీసులు



సభా స్థలికి బ్యాగులు అనుమతించకపోవడంతో స్టాపర్‌కు వేలాడదీసిన మహిళలు

ఏయూక్యాంపస్/సీతంపేట/దాబాగార్డెన్స్/ఎంవీపీకాలనీ/విశాఖ విద్య

సైడ్‌లైట్స్

- మధ్యాహ్నం ఒంటి గంట నుంచే ప్రజలను సభాస్థలికి తీసుకురావడం కనిపించింది.
- పోలీసుల కఠినమైన ఆంక్షల వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంచి నీళ్ల సీసాలు, భోజనం ప్యాకెట్లను కూడా సభాస్థలిలోకి అనుమతించలేదు.
- భోజనం పూర్తయిన తర్వాతనే బారికేడ్లలోకి రావాలని చెప్పడంతో చాలామంది అక్కడే మంచినీళ్ల సీసాలు వదిలి వెళ్లారు. మరికొందరు అక్కడి నుంచి వెనుదిరిగారు. వారిని ఆపేందుకు కూటమి పార్టీల నేతలు నానాతంటాలు పడ్డారు.
- సభకు వచ్చిన వారిలో ఎక్కువ మంది మహిళలే ఉండగా.. వారికి తగినన్ని మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు పడ్డారు.
- సభకు వచ్చిన మహిళలు వెంటనే వెనుదిరగడం చూసిన టీడీపీ, జనసేన కార్యకర్తలు వారిని ఆపే ప్రయత్నం చేశారు. కొందరు ఎమ్మెల్యేలు స్వయంగా రోడ్డుపై నిల్చుని ప్రజలను రోడ్‌షో, బహిరంగ సభ వేదిక వైపు పంపించారు.
- భోజనం నాణ్యత అంతంతమాత్రంగానే ఉండటంతో చాలామంది సగం తిని వదిలేశారు. ఉప్మా బాగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.
- మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఏయూ మెయిన్ గేట్‌కు తాళాలు వేశారు. రోడ్‌షోకు ప్రజలు వచ్చే సమయంలో మాత్రమే ఏయూ మెయిన్ గేట్‌ను తెరిచారు.
- రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఫుడ్ ప్యాకెట్లను సిద్ధం చేశారు. వీటిని రేషన్ వాహనాల ద్వారా సభాస్థలికి తరలించి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ వాహనాలను వినియోగించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.
- బహిరంగ సభకు శ్రీకాకుళం, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పాతపట్నం, టెక్కలి, తాళ్లవలస, నందిగామ, పార్వతీపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన జనాల్లో చాలా మంది సాగరతీరానికి క్యూ కట్టారు. మోదీ సభకు వచ్చి బీచ్‌లో ఎంజాయ్ చేశారు.
- మరికొంత మంది జగదాంబ జంక్షన్‌కు వెళ్లి.. ఎంచక్కా పండగ షాపింగ్ చేసుకున్నారు.
- ప్రధాని రోడ్ షోకు 60 వేల మంది ప్రజలను తరలిస్తున్నట్లు కూటమి వర్గాలు వెల్లడించినప్పటికీ.. ఆ స్థాయిలో ప్రజలు రాలేదు. రోడ్‌షోకు తరలివచ్చిన ప్రజల కోసం ప్రత్యేక కంపార్ట్‌మెంట్‌లు ఏర్పాటు చేశారు. విశాఖ ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల నుంచి ప్రజలను ఇక్కడికి తరలించారు. అయితే సాయంత్రం 4.30 గంటల వరకు పలు కంపార్ట్‌మెంట్‌లు ఖాళీగా దర్శనమిచ్చాయి.
- ఉత్తర నియోజకవర్గం నుంచి ఆశించిన స్థాయిలో జనం రాకపోవడంతో వారికి కేటాయించిన 32, 33, 34 కంపార్ట్‌మెంట్‌లు వెలవెల బోయాయి. దీంతో పలువురు నేతలు అక్కడికి వచ్చి ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, నాయకులపై అసంతృప్తి వ్యక్తం చేశారు.
- పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాల వేదికలను ఏర్పాటు చేశారు. కూచిపూడి, భరతనాట్యం, థింసా వంటి సంప్రదాయ నృత్యాలు చేస్తూ కళాకారులు అలరించారు. వెంకటాద్రి వంటిల్లు దరి ఏర్పాటు చేసిన వేదికపై నృత్యకారిణులు వందేమాతరం గీతానికి నృత్య ప్రదర్శన చేస్తూ ప్రధానికి స్వాగతం పలికారు.
- ఏయూ గ్రౌండ్‌లోని సభా ప్రాంగణం వద్దకు వెళ్లేందుకు మద్దిలపాలెం వైపు గేటు నుంచి కేవలం వీఐపీలను మాత్రమే అనుమతించారు. ఈ దారిలో వీఐపీలను మాత్రమే అనుమతిస్తారని తెలియని సామాన్య ప్రజానీకం సభా ప్రాంగణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో చాలా మంది మద్దిలపాలెం జంక్షన్‌లోనే పడిగాపులు కాశారు.



సాయంత్రం 4.30కు ఖాళీగా దర్శనమిస్తున్న పలు కంపార్ట్‌మెంట్‌లు



మద్యం షాపు వద్ద తెలుగు తమ్ముళ్ల బిజీబిజీ



అంబేడ్కర్ భవన్ నుంచి వాటర్ బాటిల్స్ తీసుకెళ్తున్న రేషన్ వాహనాలు

ఎంపీ సీఎం రమేష్ ఫ్లెక్సీల తొలగింపు

ఏయూక్యాంపస్: ప్రధాని మోదీ రోడ్ షో జరిగే ప్రాంతంలో ఏర్పాటు చేసిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఫ్లెక్సీలను బుధవారం ఉదయం తొలగించారు. అనకాపల్లి ఎంపీ అనుచరులు ప్రత్యేకంగా తయారు చేసిన ఫ్లెక్సీలను మంగళవారం రాత్రి రోడ్ షో జరిగే ప్రాంతంలో బారికేట్లలోని ఇనుప స్తంభాలకు కట్టారు. వీటిని భద్రతా సిబ్బంది పరిశీలించి తొలగించాలని సూచించారు. దీంతో కార్మికులు ఆ ఫ్లెక్సీలను తొలగించారు.

ప్రధాని సభకు వచ్చిన ముగ్గురికి అస్వస్థత

మహారాణిపేట: ప్రధానమంత్రి రోడ్డు షో, బహిరంగ సభలో పాల్గొనేందుకు వచ్చిన ముగ్గురు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. రావాడ రామారావుకు ఫిట్స్ రాగా, రత్నం కడుపునొప్పికి గురయ్యారు. లక్ష్మి కాలికి దెబ్బతగిలింది. వీరికి డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, డాక్టర్ భరత్, 108 వాహనం జిల్లా కో–ఆర్డినేటర్ వి.త్రినాథరావు, సిటీ కో–ఆర్డినేటర్ ఎం.సురేష్ ప్రథమ చికిత్స అందించి.. కేజీహెచ్‌కు తరలించారు.

ఆలస్యంగా బయల్దేరిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నంలో బుధవారం మధ్యాహ్నం 2.50 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–దుర్గ్(20830) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.30 గంటలకు బయల్దేరింది. ఈ మార్గంలో జరుగుతున్న భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ రైలు ఆలస్యంగా బయల్దేరినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

క్యారమ్స్ జాతీయ విజేత జనార్దన్‌రెడ్డి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ క్యారమ్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నెల్లూరులో జరుగుతున్న 29వ ఆలిండియా క్యారమ్స్ పోటీల్లో సింగిల్స్ విభాగంలో విశాఖకు చెందిన సీహెచ్ జనార్దనరెడ్డి టైటిల్ కైవసం చేసుకున్నారు. 70 ఏళ్ల తర్వాత ఆంధ్రాకు టైటిల్ దక్కడం విశేషం. రన్నరప్‌గా జెయిన్ ఇరిగేషన్‌కు చెందిన బీతి సందీప్ దైవ్ నిలిచారు. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ చాలా ఏళ్ల తర్వాత జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌ను సాధించిన తెలుగువాడిగా నిలవడం ఆనందంగా ఉందన్నారు.

11న ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ



సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘాల నేతలు

బీచ్‌రోడ్: ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల 19వ రాష్ట్ర మహాసభ తిరుపతిలో ఈ నెల 11న నిర్వహించనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. నగరంలోని పెదవాల్తేరు అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేలా వచ్చే పార్లమెంటు సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బీసీల ఉద్యమానికి బీసీ ఉద్యోగులు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం బీసీ నేత పితాని ప్రసాద్ మాట్లాడుతూ దేశ జనాభాలో 56 శాతంగా ఉన్న బీసీలు కులాల పేరిట విడిపోవడం వల్లే న్యాయమైన డిమాండ్లు కూడా సాధించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో డబ్బీరు కుమారస్వామి, రవికుమార్, వి.శ్యాంసుందర్, అన్నాజీరావు, పెద్దిరెడ్డి రాజశేఖర్, భాస్కర్, నాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

రేపే అప్పన్న వైకుంఠద్వార దర్శనం

45 వేల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా

ఉదయం 5 నుంచి 10.30 వరకు ఉత్తర ద్వార దర్శనం

సింహాచలం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి వైకుంఠ (ఉత్తర)ద్వార దర్శనానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఉదయం 5 నుంచి 10.30 వరకు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం లభించనుంది. ఈసారి 45 వేల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా.

1 గంట నుంచే వైదిక కార్యక్రమాలు

పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఆలయ అర్చకులు శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంటకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వైకుంఠనారాయణుడి అలంకరణ చేసి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో సహా పల్లకిలో అధిష్ఠింపజేస్తారు. ఆలయ బేడా మండపంలో 3.30 నుంచి 4.15 వరకు తిరువీధి నిర్వహిస్తారు. 4.15కు స్వామిని ప్రధాన ఆలయ ఉత్తర ద్వారం వద్దకు తీసుకొచ్చి ఆయనపై ఉండే మేలిముసుగుని తొలగిస్తారు. సంప్రదాయం మేరకు అక్కడ దేవస్థానం అనువంశిక ధర్మకర్తకి తొలిదర్శనం కల్పిస్తారు. అనంతరం స్వామిని ఉత్తర రాజగోపురంలో కొలువుంచుతారు. ఉదయం 10.30 వరకు అక్కడే భక్తులకు ఉత్తర ద్వార దర్శనరం కల్పిస్తారు. 10.30 నుంచి 11.30 వరకు సింహగిరి మాడ వీధిలో తిరువీధి నిర్వహిస్తారు.



ముస్తాబవుతున్న అప్పన్న స్వామి కొలువుదీరే ఉత్తర రాజగోపురం

పటిష్ట ఏర్పాట్లు

- సింహగిరిపై పర్మినెంట్ క్యూలు, తాత్కాలిక క్యూలతో కలిపి ఈసారి 25 వేల 250 మంది భక్తులు ఒకేసారి వేచి ఉండేలా ఉచిత దర్శనం, రూ.100, రూ.300ల దర్శన క్యూలు, రూ.500 ఉత్తర ద్వార దర్శన ప్రత్యేక క్యూ, ప్రొటోకాల్ వీఐపీల దర్శన క్యూలు ఏర్పాటు చేస్తున్నారు.
- ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న క్యూలైన్లలో నడుస్తూనే 15 నిమిషాలపాటు స్వామిని భక్తులు తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
- కేవలం లడ్డూ ప్రసాదాన్ని మాత్రమే విక్రయించనున్నారు. సుమారు లక్ష లడ్డూలను సిద్ధం చేస్తున్నారు.
- శుక్రవారం తెల్లవారుజామున 4 నుంచి సింహగిరికి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. గురువారం సాయంత్రం 6 గంటల తర్వాత ఏ వాహనాలన్నీ సింహగిరికి అనుమతించరు.
- సింహగిరిపై నాలుగు భారీ స్క్రీన్‌ల ద్వారా భక్తులు ముక్కోటి ఉత్సవ విశేషాలను తిలకించే ఏర్పాట్లు చేస్తున్నారు.
- భక్తుల వాహనాలను కొండ దిగువనే నిలిపేందుకు పలు ప్రదేశాల్లో వాహనాల పార్కింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు.
- 9వ తేదీ రాత్రి నుంచి 10వ తేదీ సాయంత్రం వరకు అడవివరంలో మద్యం దుకాణాలను ఎక్సైజ్ శాఖ మూసివేస్తుంది.

దర్శన వేళల్లో మార్పు

ఉత్తరద్వార దర్శనం శుక్రవారం ఉదయం 10.30కు ముగిసినా మధ్యాహ్నం 2 గంటల వరకు మూలవిరాట్ దర్శనం లభిస్తుంది. మహానివేదన కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు దర్శనాలు నిలుపుచేస్తారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 7 వరకు దర్శనాలు ఇస్తారు. రాత్రి 7 గంటల తర్వాత భక్తులకు దర్శనాలు లభించవు. 9వ తేదీ గురువారం రాత్రి 7 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయి. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను వైదికులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి దేవస్థానం ఈవో వి.త్రినాథరావు బుధవారం పరిశీలించారు.

ఏయూ సెర్చ్ కమిటీ ఏర్పాటు

- వీసీ ఎంపికకు కసరత్తు మరూ

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్(వీసీ) నియామక ప్రక్రియలో మరో ముందడుగు పడింది. యూనివర్సిటీకి ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం నుంచి గౌహతి ఎన్ఐపీఈఆర్ డైరెక్టర్ ఆచార్య యూఎస్ఎన్ మూర్తి, ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తరఫున ముంబయిలోని ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ ఆచార్య ఎస్.మహేంద్రదేవ్, యూజీసీ నుంచి కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య భట్టు సత్యనారాయణను నియమించారు. దీంతో వర్సిటీకి వీసీ నియామక ప్రక్రియ వేగవంతమైనట్లయింది. ఏయూ వీసీ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు వందకు పైగా అభ్యర్థుల్లో ముగ్గురి పేర్లను సెర్చ్ కమిటీ ఎంపిక చేయనుంది. వర్సిటీ ప్రస్తుత ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావుతో పాటు, పలువురు ఆచార్యులు సైతం దరఖాస్తు చేశారు. సెర్చ్ కమిటీ ముగ్గురు పేర్లను ఖరారు చేసి, గవర్నర్ ఆమోదానికి పంపిస్తారు. గవర్నర్ ఆమోదం మేరకు ప్రభుత్వం వీసీ పేరును ప్రకటించనుంది. నిబంధలను ఎలా ఉన్నా.. ప్రభుత్వం ఆశీస్సులున్న వారికే వీసీ పోస్టు దక్కుతుందనేది జగమెరిగిన సత్యం. దీంతో ఆశావహులంతా లాబీయింగ్ కోసం కూటమి పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో తలమునకలై ఉన్నారు.

